## డీసీపల్లిలో పొగాకు ధరలు



మర్రిపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 1056 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 894 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 162 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.315 కాగా, కనిష్ఠ ధర రూ.75లు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

## 'సోమశిల'కు తగ్గిన వరద

అనంతసాగరం అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం 25,205 క్యూసెక్కులు వస్తుండగా శనివారానికి 17,308 క్యూసెక్కులకు పడిపోయింది. డ్యాంలో 72.532 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 11,200, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



## విద్యారంగ ఆర్థిక సమస్యలపై 7న ధర్నా

కందుకూరు : విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న విజయవాడలో తలపెట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఫ్యాప్టో నేతలు కోరారు. శనివారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ విజయవాడకు కందుకూరు నుంచి తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.



# ఆటో డ్రైవర్ల సేవలో..

# అట్టహాసంగా...

**జిల్లాలో ప్రారంభించిన మంత్రి ఆనం, కలెక్టర్ శుక్లా**

**నియోజక వర్గాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు ● ఆనందోత్సాహాలతో ఆటోడ్రైవర్ల ర్యాలీలు**



కావలిలో ఆటోడ్రైవర్ల ర్యాలీ



కోవూరులో ఆటోవాలాల ర్యాలీ



కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

నెల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు చేయూతనిస్తూ 'ఆటో డ్రైవర్ల సేవలో..' అనే మహోత్తర పథకాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ.15 వేల నగదును జమ చేసింది. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించగా, నెల్లూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లాలు ప్రారంభించారు. అలానే జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఆటో డ్రైవర్ల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత ఖాకీ చొక్కాలు ధరించి, ఆటో డ్రైవర్లతో కలిసి భారీ ర్యాలీలు నిర్వహించారు.

● నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి, ఆర్డీవో అనూష, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకముందు ఆర్టీసీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ జరిగింది.

● ముత్తుకూరులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్ శివప్రసాద్‌తోపాటు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. ముందుగా జెన్‌కో రోడ్డు కూడలి నుంచి ముత్తుకూరు ఎంపీడీవో కార్యాలయం వరకు ఆటోవాలాలు ర్యాలీ నిర్వహించారు.

● ఉదయ గిరిలోని గండిపాళెం సర్కిల్ నుంచి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పట్టణ పురవీధుల గుండా ఆటో నడుపుతూ టీటీడీ కల్యాణ మండ పం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి తదితర కూటమి నాయ కులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావే శంలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు.

● కోవూరులో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆర్డీవో పావని పాల్గొనగా, ఆర్‌ఆర్ కాలనీ నుంచి బజారు కూడలి వరకు ఆటోలతో ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరుపాలెం సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

● కావలిలో ఆటోలతో ర్యాలీ జరగ్గా ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి స్వయంగా ఆటో నడుపుకుంటూ వచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

### థాంక్యూ సీఎం సార్..

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలిచి, రూ.15,000 బ్యాంకు ఖాతాకు జమచేయటం ఆనందంగా ఉంది. థ్యాంక్యూ సీఎం సార్... అంటూ కావలి పట్టణంలోని వైకుంఠపురానికి చెందిన ఆటో డ్రైవర్ తాతా హరిబాబు ఆనందం వ్యక్తం చేశాడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చారు. ఈ నగదు వాహన నిర్వహణకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.



తన ఫోన్‌లో నగదు జమ అయిన మెసేజ్ చూపుతున్న తాతా బాబురావు



ముత్తుకూరులో లబ్ధిదారులకు నమూనా చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, జెడ్.శివప్రసాద్ తదితరులు



నెల్లూరు నగరంలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, పక్కన కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు



ఉదయగిరిలో ఆటో నడుపుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే కంభం

## కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షపాతి

**17,406 మంది ఆటోడ్రైవర్లకు రూ.26 కోట్లు ● మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అనేందుకు ఉదాహరణ ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించడమేనని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 17,406 మంది డ్రైవర్ల ఖాతాల్లో రూ.26 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వీరిలో మైనారిటీస్ కార్పొరేషన్ ద్వారా 402 మందికి, వైశ్య కార్పొరేషన్ ద్వారా ఇద్దరికి, బీసీ ఎ కార్పొరేషన్ ద్వారా 2946, బీసీ బి కార్పొరేషన్ ద్వారా 1921, బీసి డి కార్పొరేషన్ ద్వారా 1755, బీసీఈ కార్పొరేషన్ ద్వారా 2045, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 24, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 340, కమ్మ కార్పొరేషన్ ద్వారా 327, కాపు కార్పొరేషన్ ద్వారా 957, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 14, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 744, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4,804, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 1014, ఇతరులు 11 మంది ఆటో డ్రైవర్లకు వారి ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరో మంచి పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. అర్హత ఉన్న వాళ్లలో ఎవరైనా మిస్ అయిన వారికి సచివాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడంతోపాటు హెల్ప్‌లైన్ కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డీటీసీ చందర్, టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల వినియోగంపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, వ్యవసాయాధికారులు

## లాభసాటి వ్యవసాయానికి ప్రణాళికలు

**యాంత్రీకరణతో రైతులకు ఆదాయం ● కలెక్టర్ హిమాన్షు శుక్లా**

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.. దీనిపై ఆధారపడి ఎంతో మంది రైతులు జీవనం సాగిస్తున్నారు.. అందుబాటులో ఉన్న నూతన విధానాల అమలు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం'.... అని కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శనివారం వ్యవసాయ యాంత్రీకరణపై వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో వినూత్న విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి, చూపిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఇందుకు జిల్లాలోని అన్నీ గ్రామ పంచాయితీల్లోని ఔత్సాహిక రైతులను ఎంపిక చేసి, వారిని వ్యవసాయ విజేతలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ సాగులో పురోగతి సాధించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపుతూ ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలన్నారు.

**పూర్తిస్థాయిలో యాంత్రీకరణ**

పంటల సాగులో పూర్తిస్థాయిలో యాంత్రీకరణ అమలు చేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. పెట్టుబడులు తగ్గి ఉత్పాదకత పెరుగుతుందని, తద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను గుర్తించి, వాటిని అందించాలన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, యంత్ర పరికరాలు, వాటి అవసరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే యంత్ర పరికరాలను రైతులు ఉపయోగిస్తున్నారని, వారి అనుభవాలను కూడా తెలుసుకోవాలన్నారు. ఈసందర్భంగా యూరియా వినియోగానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, మత్స్యశాఖ అధికారి కే.శాంతి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, ఆత్మ పీడీ మురళితోపాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### ఉపాధి చూపించాకే భూసేకరణ చేపట్టండి

కావలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు చూపించాకే భూసేకరణ చేపట్టాలని చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం రైతులు అధికారులను కోరారు. రామాయపట్నం పోర్ట్ అనుబంధ పరిశ్రమలకు అవసరమైన భూసేకరణలో భాగంగా శనివారం మధ్యాహ్నం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. జేసీ వేంకటేశ్వర్లు, మారిటైంబోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ, కావలి తహసీల్దార్ పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. రైతుల అభిప్రాయాలను జేసీ అడిగి తెలుసుకున్నారు. రైతుల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని జేసీ తెలిపారు.

## రేషన్ మాఫియాపై ఉక్కుపాదం



'పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు దోడ్డిదారిన తరలిస్తున్నారు. అలాంటి మాఫియాపై ఉక్కుపాదం మోపుతాం.' అని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల జేసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

**ఇక నిరంతర తనిఖీలు.. అక్రమార్కులను వదిలిపెట్టం**

**ఆంధ్రజ్యోతితో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు**

**? రేషన్ బియ్యం అక్రమ తరలింపును గుర్తించారా**

! నెల్లూరు నగరంలో ఇటీవల ఐదు లారీల బియ్యం అక్రమ తరలింపు వ్యవహారం వెలుగుచూసింది. ఇలా ఎందుకు జరుగుతుందో కూలంకషంగా పరిశీలిస్తాం. ఎక్కడ నుంచి ఈ వ్యవహారం నడుస్తుందో తెలుసుకుంటాం.

**? అక్రమార్కులపై చర్యలు ఎలా ఉంటాయి**

! పేదల కోసం రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. డీలర్లయినా, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచైనా బియ్యం అక్రమ తరలింపు జరిగిందని నిర్ధారణ అయితే చర్యలు తీవ్రంగా ఉంటాయి. అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

**? పీజీఆర్ఎస్‌లో అర్జీల మాటేమిటి**

! 2024 జూన్ 15న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మొదలైంది. ఇప్పటిదాకా 52,438 అర్జీలు వచ్చాయి. వాటిలో 48,452 అర్జీలు పరిష్కరించగా, 3986 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 22022 ఫిర్యాదులు అందగా, 19,387 ఫిర్యాదులను పరిష్కరించారు. 2,635 పెండింగ్‌లో ఉన్నాయి.

**? ఎడగారు సీజనులో సాగు విస్తీర్ణం ఎంత**

! వ్యవసాయ శాఖ 98 వేల ఎకరాలలో సాగు జరుగుతుందని అంచనా వేసినా, 1.98 లక్షల ఎకరాల్లో వరి వేశారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్క గట్టారు. జిల్లాలో ఎక్కువగా కేఎన్ఎం-1638 రకం వరిని 1.64 లక్షల ఎకరాల్లో వేశారు. ఆ తర్వాత ఎంటీయూ 1010, కేఎన్ఎం-733, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను సాగుచేశారు.

**? ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని**

! జిల్లాలో ఎడగారు ధాన్యం సేకరణ కోసం 54 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. సంగం, సర్వేపల్లి, కావలి, కోవూరు, ఆత్మకూరు ప్రాంతాలలో పంట చేతికందింది. విక్రయానికి ధాన్యం సిద్ధంగా ఉండటంతో ఆ ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

**? ఇప్పటిదాకా సేకరించినది**

! 168 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. ఈ ధాన్యాన్ని సంగం మండలంలోని తరుణవాయి, మర్రిపాడుల నుంచి సేకరించాం.

**? మద్దతు ధర మాటేమిటి**

! ఎడగారులో పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గ్రేడ్ -ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,369 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. పుట్టికి గ్రేడ్-ఏ రకానికి రూ.20,306.50, సాధారణ రకానికి పుట్టికి రూ. 20,136.50గా నిర్ణయించింది.

**? ఎన్ని మిల్లులను ట్యాగ్ చేశారు**

! ధాన్యం సేకరణకు సంబంధించి రైస్‌మిల్లర్లు రూ.32కోట్ల బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారు. 59 మిల్లులను కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేశారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం మిల్లులకు సక్రమంగా వెళ్లడానికి, తీసుకున్న ధాన్యానికి సకాలంలో నగదు చెల్లించేందుకు వీలుకలుగుతుంది. రైతులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం.

**? భూముల రీసర్వే గురించి వివరించండి**

! జిల్లాలో ఇప్పటివరకు రెండు విడతలలో భూముల రీసర్వే జరిగింది. మూడో విడత సర్వే ప్రారంభమైంది. ఈ విడతలో 34 గ్రామాలలో 89,368 ఎకరాలను రీసర్వే చేయిస్తాం. ఇందుకుగాను 76 బృందాలను ఏర్పాటు చేశాం. ఒక బృందం 25 ఎకరాలు చొప్పున సర్వే చేస్తుంది.

**? డ్రోన్ సర్వే పూర్తయిందా**

! మూడో విడత భూముల రీసర్వేకు సంబంధించి డ్రోన్ సర్వే త్వరలో చేపడతాం. భూముల రీసర్వేకు 43 రోవర్‌లు సిద్ధంగా ఉన్నాయి. మూడో విడత సర్వేలో ఎలాంటి సమస్యలు లేకుండా ఖచ్చితత్వంతో కూడిన సర్వే చేయిస్తాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)




పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

## నేరాల కట్టడి పోలీసు బాధ్యత

**● పోలీస్ అధికారులతో ఎస్పీ అజిత వేజెండ్ల**

నెల్లూరు(క్రైం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నేరాలను కట్టడి చేసి, ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు కల్పించి, ప్రశాంత వాతావరణం నెలకొల్పడం పోలీసుల బాధ్యత అని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శనివారం రాత్రి ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పెడింగ్ కేసుల పరిష్కారం, నేర నియంత్రణ చర్యలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, సింగిల్ నెంబర్లాట, పేకాట తదితరాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు. కాగా సహజంగా క్రైం మీటింగ్ అంటే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, లేదా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వహించడం సహజం. అయితే మొదటిసారి సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించడంపై జిల్లాలోని పోలీసు అధికారుల్లో చర్చనీయాంశం అయ్యింది. సాయంత్రం పోలీసు స్టేషన్లకు అధిక సంఖ్యలో బాధితులు తమ కేసుల విషయంలో వచ్చి ఎదురు చూడటం సహజమే. ఈ క్రమంలో శనివారం రాత్రి స్టేషన్ అధికారులు స్టేషన్‌లలో లేకుండా బయట ఉన్నారని సిబ్బంది చెప్పిన మాటలు ప్రజలకు అసహనం కల్పించాయని చర్చ సాగింది.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 138 |
| స్కిన్ చికెన్ | 246 |
| స్కిన్‌లెస్ | 270 |

కోడిగుడ్ల ధర (100): 520

**బంగారం, వెండి ధరలు**

| బంగారం (22 క్యారెట్లు) | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.11,273 |
| వెండి కిలో ధర | రూ. 1,51,500 |
| వెండి ఒక గ్రాము | రూ.155.50 |

## ముగిసిన బాబా విజయదశమి ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ (గాంధీబొమ్మ) షిరిడీ సాయిబాబా మందిరంలో విజయదశమి, బాబా సమాధి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. 4రోజులు పాటు జరిగిన ఈ ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు, షిరిడీ హారతులు, పల్లకీసేవలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం కమిటీ చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# మంచి చేసే సర్కారుకు అండగా నిలుద్దాం

● ఆటో డ్రైవర్ల సేవలో..ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



జంబో చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో అనూష

నెల్లూరురూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అందరికీ మంచి చేయాలన్న ఆలోచనతో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీల ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం నెల్లూరులోని కస్తూరిదేవీ గార్డెన్స్‌లో ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం అందచేసిన ఆర్థిక సహాయం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డితో కలిసి ఆటోవాలాలకు జంబో చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలకు మంచి చేసే సర్కారుకు అండగా నిలవాలని కోరారు. స్త్రీశక్తి పథకంతో ఆటోడ్రైవర్లు ఆర్థి కంగా నష్టపోతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు వారి ఖాతాల్లో రూ.15 వేలు జమ చేయడం అభినం దనీయమన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో చెప్పినవి, చెప్ప నవి కూడా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమం సమానంగా ముందుకు తీసుకెళ్లగలిగిన ప్రభుత్వం కూటమి పార్టీలదేనని స్పష్టం చేశారు. నెల్లూరురూరల్లో 3,479 మంది ఆటో డ్రైవర్లకు రూ. 5.22 కోట్లును ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు. అంతకు ముందు వీఆర్‌సీ సెంటర్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జరిగిన ఆటో ర్యాలీలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆటోను నడుపుకుంటూ వచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో అనూష, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎన్ భానుశ్రీ, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### నేడు 'నవ్వండి నవ్వించండి'

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో చేతన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నవ్వండి నవ్వించండి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి వై.శేషగిరీశం తెలిపారు. ఈ మేరకు శనివారం పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సినీ హాస్య గీతాల పోటీలు, ప్రముఖ హాస్యనటులపై క్విజ్, జోక్స్ కార్యక్రమం నిర్వహిస్తామని అందులో అందరూ పాల్గొని బహుమతులు గెలుచుకో వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవీ నటులు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఎస్.సుబ్బరాయుడు, వి.కేశవులు, షేక్.అబ్దుల్ మజీద్, ఎస్వీ.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

### నవంబరు 5న మహా కార్తీక దీపోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం, స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నవంబరు 5వ తేదీన మహాకార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కే.వెన్నెల, ఉపాధ్యక్షురాలు కే.జయప్రదలు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎన్ఆర్ కల్యాణ మండపంలో కార్తీక దీపోత్సవ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6గంటలకు గోపూజతో ప్రారంభించి తాత్కాలిక శివలింగానికి ప్రజలందరితో అభిషేకాలు, రుద్రహోమం, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, సాయంత్రం ఆకాశదీపోత్సవం, గంగాహారతి, మహా కార్తీక దీపోత్సవం, ఆధ్యాత్మిక ప్రవచన, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వేలాది మంది భక్తులు ఈ కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే శ్రీస్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నవంబరు 7న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకంఠం రమణయ్య, కోడూరు జయరామయ్య, ముక్కాల వ్యాస్‌ప్రసాద్, ఏవీఆర్ మోహన్‌రావు, రఘునాథరాజు, పీ.జనార్దన్‌రాజు, వి.హర్షవర్ధన్, కాకు మురళీరెడ్డి, గడ్డం విజయకుమార్, కార్తీక దీపోత్సవ కమిటీ సెక్రటరీ ప్రవీణ పాల్గొన్నారు.

## నగరంలో భారీ ర్యాలీ



నగరంలో నిర్వహిస్తున్న ఆటోల ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం సందర్భంగా నగరంలో ఆటోవాలాలు భారీ ర్యాలీ నిర్వహిం చారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఖాకీ చొక్కా ధరించి, ర్యాలీలో పాల్గొన్నారు. గాంధీబొమ్మ నుంచి స్టోన్‌హౌస్‌పేటకు జరిగిన ర్యాలీలో ఆటోడ్రైవర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఎస్‌టీఎస్ కల్యాణ మండపంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి మంత్రి ఆనం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు.

## రాజరాజేశ్వరి హుండీ ఆదాయం రూ.31.14 లక్షలు



హుండీల్లో కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది, భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ హుండీల లెక్కింపు శనివారం జరిగింది. గత నెల 15 నుంచి ఈనెల 4వ తేదీ వరకు 20 రోజులు భక్తులు సమర్పించిన కానుకలు ద్వారా రూ.30,45,197లు, అన్నదానం హుండీ ద్వారా రూ.69,124 మొత్తం రూ. 31,14,321 వచ్చాయి. వీటితోపాటు 073.000 బంగారం వస్తువులు, 0298.000 వెండి వస్తువులు, యూఎస్ఏ డాలర్లు 13 వచ్చాయి. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసబాబు, రామలింగేశ్వరస్వామి, పూడిపర్తి దేవాలయాల ఈవో ఎన్.శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

## నారాయణరెడ్డిపేటలో 'చేనేత అధ్యయన యాత్ర'



మగ్గం పరిశీలిస్తున్న కార్మిక సంఘం నాయకులు

నెల్లూరురూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల అవస్థలపై రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేస్తున్న ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు శనివారం నెల్లూరురూరల్లోని నారాయణరెడ్డిపేటలో నేత కార్మికులతో భేటీ అయ్యారు. మగ్గాలను పరిశీలించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని సూచించారు. నేత ముడిసరుకుపై జీఎస్టీ తొలగించి ఉపశమనం కలిగించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నేత కార్మిక కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. గత ప్రభుత్వం చేనేతలకు ఇస్తుండిన ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సహాయాన్ని రూ.36 వేలకు పెంచి ఆర్థిక భరోసా ఇవ్వాలని చెప్పారు. చేనేత వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పించి వృత్తిపరంగా అండగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దశరథరామయ్య, బాలాజీ, పముజుల హరి, ఆకురాతి లక్ష్మీకాంతం, సానం శ్రీనివాసులు, పూజల అర్జున్, కుండా సుబ్బారావులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నంబరు 1గా తీర్చిదిద్దుతాం

● ఆలయ పాలక మండలి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులందరూ సహకరిస్తే కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నెంబరు 1గా తీర్చిదిద్దుతామని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు.షణ్ముఖరావులు తెలిపారు. శనివారం ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు. ఈ ఏడాది కన్యకా పరమేశ్వరి ఆలయంపై 320 పేజీల సావనీర్ ప్రచురించి విడుదల చేశామని తెలిపారు. కొంతమంది సోషల్ మీడియా ద్వారా నిధులు పక్కదారి పట్టాయని చేసిన అసత్య ప్రచారాన్ని ఖండించారు. అసత్య ప్రచారాలు మాని ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత పాలకులు దేవస్థానంకు సంబంధించి ఒక్క పైసా కానీ, లెక్కలు కానీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి తమ సొంత నిధులు వెచ్చిస్తున్నామన్నారు. సోదర ఆర్యవైశ్యులే అసత్యాలు ప్రచారం చేస్తూ కన్యకాపరమేశ్వరి ఆలయం ప్రతిష్ఠ దెబ్బయ్యవద్దని కోరారు. ఈ సమావే శంలో ఆలయ కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పార్కుల్లో సౌకర్యాలు కల్పించండి : కమిషనర్



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పార్కుల్లో ప్రజల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలలు సమకూర్చాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని 11, 14 డివిజన్లలోని పార్కులను ఆయన ఇంజనీరింగ్ అధికారులుతో కలిసి పరిశీలించారు. పార్కుల్లో పచ్చదనం కోసం మొక్కలు, క్రీడాపరికరాలు, ఆటవస్తువులు ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నగర ప్రజలు సేద తీరేందుకు అన్ని వసతులు పార్కుల్లో ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ ఫార్మసీ అధికారి మృతికి పలువురి సంతాపం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఫార్మసీ అధికారిగా పనిచేస్తున్న విడవలూరు మండలం ముదివర్తికి చెందిన జోగి రమేష్ శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతికి వైద్యాధికారులు, సిబ్బంది, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు సంతాపం తెలిపారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం భేటీ అయ్యారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ మేరకు మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరురూరల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహకారం అందచేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలదంకి సుధాకర్, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, శివ పాల్గొన్నారు.

## టానిక్ లిక్కర్ మాల్ పేరు తొలగింపు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో అట్టహాసంగా ప్రారంభించిన టానిక్ లిక్కర్ మాల్ పేరును శనివారం తొలగించారు. అసలు విషయానికి వస్తే టానిక్ లిక్కర్ మాల్ పేరుపై మూడు రాష్ట్రాల్లో అధికారికంగా లిక్కర్ మాల్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో నెల్లూరు నగరంలో తమకు సంబంధం లేకుండా తమ బ్రాండ్ టానిక్ పేరుపై లిక్కర్ మాల్ ఓపెన్ చేశారంటూ కోర్టును ఆశ్రయించారు. ఇరువురు వాదనలు విన్న కోర్టు టానిక్ లిక్కర్ మాల్ పేరు ను తొలగించాలని తీర్పు ఇవ్వడంతో శనివారం బోర్డును తొలగించారు.

## సబ్‌స్టేషన్ల నిర్వహణ బాధ్యతగా చేయండి

● ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



సబ్‌స్టేషన్‌లో ప్యానల్ బోర్డును పరిశీలిస్తున్న డైరెక్టర్ గురవయ్య

నెల్లూరు(జడ్పీ), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణను అధికారులు, సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య సూచించారు. నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల నిర్వహణ బాగుంటేనే నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించగలుగుతామన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రతి ఫీడర్‌ను క్రమం తప్పకుండా నిర్వహణ చర్యలు చేపడితే విద్యుత్ సమస్యలు అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, ఈఈ లక్ష్మీనారా యణ, ఏడీలు కిరణ్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా ఆటో డ్రైవర్ల సేవలో..

● ఎమ్మెల్యే సోమిరెడ్డి



ముత్తుకూరు : ఆటో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



కోవూరులో పాల్గొన్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : చరిత్రలో నిలిచిపోయేలా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులో శనివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, ఇతర మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో జెన్‌కో రోడ్డు కూడలి నుంచి ముత్తుకూరు మండల పరిషత్ కార్యా లయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో 17406 మంది ఆటో డ్రైవర్లకు రూ. 26.10 కోట్లు అకౌంట్లలో జమయ్యాయన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 2651 మందికి రూ.3.98 కోట్లు లబ్ధి జరిగింద న్నారు. వైసీపీ హయాంలో రూ.10 వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.15 వేలకు పెంచిందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జడ్. శివప్రసాద్, జనసేన నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మును స్వామి, నాయకులు బొమ్మి సురేంద్ర, రాధా కృష్ణమనాయుడు, రఘుబాబు, మస్తాన్‌బాబు, రామకృష్ణారెడ్డి, రమేష్‌శర్మ, రాగల శివకృష్ణ, బొలిగర్ల శ్రీనివాసులు, ఏడుకొండలు, సతీష్ నాయుడు, డీఎల్పీఓ వసుమతి, ఎంపీడీవో నాగ మణి, తహసీల్దారు స్వప్న, సీఐ రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

**కోవూరు :** ఆటోడ్రైవర్లకు చేయూతనివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలె పాటి సుబ్బానాయుడు అన్నారు. స్థానిక కేవీఎస్ కళ్యాణ మండపంలో జరిగిన 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలో 2795మంది ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మోహనరావు, ఎంపీపీ తుమ్మల పెంట పార్వతి, ఏఎంసీ చైర్మన్ బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, సర్పంచ్ యాకసిరి విజయ, టీడీపీ నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, టీడీపీ కో వూరు, విడవలూరు, కొడవలూరు, ఇందు కూరు పేట, బుచ్చిరెడ్డిపాళెం మండల కమిటీల అధ్య క్షులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, శ్రీహరిరెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి బెజవాడ జగదీశ్ పాల్గొన్నారు.

**విడవలూరు:** ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. సినిమా హాలు సెంటర్ నుంచి తహసీల్దారు కా ర్యాలయం వరకు ఆటో డ్రైవర్లు, టీడీపీ నాయ కులు ర్యాలీ నిర్వహించారు. దంపూరులో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ కొమ్మి శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి, ఎంపీటీసీలు చలంచర్ల కామేశ్వరి, భాను, నాయకులు చెముకుల శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

**బుచ్చిరెడ్డిపాళెం:** రేబాల గ్రామంలో టీడీపీ నాయకుడు ఏటూరి శివరామకృష్ణారెడ్డి, సర్పంచు భాగ్యలక్ష్మి కార్యకర్తలు ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ప్రారంభం సందర్భంగా సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌ను ఆటో డ్రైవర్లతో కలిసి వీక్షించారు. పెనుబల్లి సర్పంచ్ పెంచల య్య ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయ కులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## వామ్మో.. కొండచిలువ!



పది అడుగుల కొండచిలువ

మనుబోలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండేపల్లి బ్రాంచ్ కనుపూరు కాలువలో పది అడుగుల కొండ చిలువ కనిపించింది. జట్లకొండూరు వద్ద కాలువలోంచి పొలాల్లోకి వెళుతుండగా శనివారం రైతులు కర్రలతో కొట్టి చంపేశారు. పొలాల్లోకి వెళ్లి ఉంటే తమకు కొండచిలువతో ప్రాణాపాయం జరిగేదని రైతులు తెలిపారు.

## రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా అత్తిరాల సురేష్



విడవలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం శ్రీ కామాక్షీదేవి సమేత శ్రీ రామ లింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా అత్తిరాల సురేష్‌ను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 10న ఆలయ చైర్మన్‌తో పాటు పాలక మండలి సభ్యులు 11 మంది ప్రమాణస్వీకారం చేయ్యనున్నారు. ఈ వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొంటారని టీడీపీ శ్రేణులు తెలిపాయి.

## పోషణ్ మాసోత్సవాలు

మనుబోలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని కాగితాలపూరు, వీరంపల్లి పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. వీరంపల్లి అంగన్ వాడీ కేంద్రాన్ని సీడీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పదార్థాలు ఉచితంగా అందిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, సీతాలక్ష్మీ, కార్యకర్తలు రేవతి, విజయమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

## ఆగని మోటారు చోరీలు

● తాజాగా అన్నారెడ్డిపాళెంలో చోరీకి గురైన మోటారు



చోరీకి గురైన మోటారు బోరును చూపుతున్న రైతు వెంకయ్య

విడవలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించే మోటార్ల చోరీలు మండలంలో కొనసాగుతూనే ఉన్నాయి. గడిచిన రెండు నెలల్లో చౌకిచర్ల, దంపూరు, గాదెలదిన్నె ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 10 మోటార్లని ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ వైర్లని దొంగతనానికి పాల్పడ్డారు. స్థానిక పోలీసులు ఎంత నిఘా పెట్టినా వారికి దొరకకుండా ముఠాగా ఏర్పడి ఈ మోటారు దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా అన్నారెడ్డిపాళెం గ్రామం భద్రావలంలో శనివారం వేకువ జామున ఈదూరు వెంకయ్య పొలంలో సుమారు రూ.1.20లక్షలు విలువ చేసే మోటారు, కరెంటు వైర్లు, తాడు, మోటారు పైపులును దొంగిలించారు. దీంతో సదరు రైతు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో వరుసగా మోటార్లు చోరీకి గురవుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైన పోలీసులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏతైన ఉందని రైతులు తెలుపుతున్నారు.

## బ్రహ్మదేవంలో న్యాయ విజ్ఞాన సదస్సు




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

ముత్తుకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆధ్వర్యంలో శనివారం గోవిందరెడ్డిపాలెం ఎస్సీ కాలనీ లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టాలను గురించి వివరించారు. బాల బాలికల అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యాయం పొందే అవకాశాలను కోల్పోకుండా ఉండడం కోసం ఉచిత న్యాయ సలహాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇబ్బందులు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థల టోల్ ఫ్రీ నెంబరు 15100లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విక్రమ సింహపురి కోవూరు జూనియర్ సివిల్ జడ్జి శివనమృత, వీఆర్‌వో నారాయణ, పంచాయతీ సెక్రటరీ లెనిన్, సీడీపీవో రాజ్యలక్ష్మీ, పారా లెగల్ వాలంటరీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

● జీఎస్టీపై అవగాహన

సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మదేవం గ్రామ పంచాయతీలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, కావాలి మస్తాన్, గుడి శ్రీనియ, దినేష్, కిరణ్, శ్రీను, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్యాధికారి హర్షవర్ధన్ మృతి

కొడవలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు పశు వైద్యాధికారి హర్షవర్ధన్ (43) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. నెల్లూరులో జరిగిన అంత్యక్రియల్లో జిల్లా పశు వైద్య అధికారులు, కొడవలూరు, గ్రామస్థులు, రైతులు పాల్గొని మృతదేహానికి నివాళులు అర్పించారు.

## గిఫ్ట్‌ల ఆశ చూపి.. పోటీ పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): కొన్ని కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు బహుమతుల ఆశ చూపి పోటీ పరీక్షలు నిర్వహిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని అపస్మా జిల్లా అధ్యక్షుడు నేతలనూతల శ్రీధర్ అన్నారు. శనివారం ఎంఈఓ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అపస్మా ప్రతినిధులు రామసుబ్బారెడ్డి, అయూబ్‌ఖాన్, మల్లేశ్వర్ రెడ్డి, కరస్పాండెంట్లు మున్నా, మన్సూర్, చిట్టిబాబు, కృష్ణారెడ్డి, సజన పాల్గొన్నారు.

## ● 'పెన్న'మ్మ మేనిపై 'సంధ్యా' కాంతులు


పోతిరెడ్డిపాళెం సమీపంలో కాంతివంతంగా కనిపిస్తున్న పెన్నానది

పెన్నానదిలో సూర్యాస్తమయ కాంతి ప్రకృతి ప్రేమికుల్ని ఆకట్టుకుంది. పోతిరెడ్డిపాళెం సమీపంలో పెన్నానదిపై పడుతున్న సూర్య కిరణాల సౌందర్యాన్ని చూసి ప్రయాణికులు పరవశుల య్యారు. శనివారం నెల్లూరు- కోవూరు మార్గంలో ప్రయాణిస్తున్న యువకులు తమ సెల్‌ఫోన్లలో ఈ సుందర దృశ్యాన్ని 'క్లిక్'మనిపించారు. 'పెన్నానది ఎలా కాంతులీనుతుందో చూడు'... అంటూ పెన్నమ్మ మేనిపై పసిడి కాంతుల అనుభూతిని మనసారా ఆస్వాదించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

## ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవం


అమ్మవారి గ్రామోత్సవంలో ఆకట్టుకున్న కాంతార వేషధారణ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమను శనివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు వివిధ అలంకరణల్లో పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. గ్రామోత్సవంలో నిర్వహించిన వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



# ఆటోవాలా ఆనందం

## అమలులోకి ఆటో డ్రైవర్ సేవలో.. ● నగదు జమతో హర్షాతిరేకాలు

రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం వారి ఖాతాల్లో శనివారం రూ.15వేలు జమ చేసింది. దీంతో ఆటోడ్రైవర్లు ఆనందంలో మునిగిపోయారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా సీఎం చంద్రబాబు నాయుడు మమ్మల్ని ఆదుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. మళ్లీ మళ్లీ చంద్రబాబు నాయుడే సీఎం కావాలని వారు ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో రూ.10 వేల నగదు వేసి, జరిమానాల పేరుతో అంతకు అంత గుంజుకున్నదని వారు దుయ్యబట్టారు. ప్రస్తుతం ఎలాంటి జరిమానాలు లేకుండా నగదు వేయడంతో తమ కుటుంబ అవసరాలకు, ఆటో ఇన్సూరెన్స్‌లకు ఈ మొత్తం ఎంతగానో ఉపయోగపడిందని ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఆ ఆనందాన్ని వారి మాటల్లోనే..

### ప్రభుత్వం భరోసా ఇచ్చింది!



కూటమి ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 15 వేలు వేయడం ఆనందంగా ఉంది. ఎన్నికల హామీ కాకపోయినా ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించింది. కూటమి ప్రభుత్వం పనితీరు బేష్. కూటమి ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాలి.

- ఖలీల్, ఆటో డ్రైవర్, సంగం

### రుణపడి ఉంటాం



ఆటోవాలాలకు ఏడాదికి రూ.15 వేలు ఇవ్వడం శుభపరిణామం. గత ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి జరిమానాల రూపంలో రెట్టింపు వసూలు చేసింది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆటోవాలాలంతా చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

- ఆవుల మధు, మాసాయిపేట, ఉదయగిరి

### ఆనందంగా ఉంది!



కూటమి ప్రభుత్వ ఆటో డ్రైవర్లను ఆదుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. గత ప్రభుత్వంలో రూ. 10 వేలు వేస్తే, కూటమి ప్రభుత్వం మరో ఐదు వేలు పెంచి రూ. 15 వేలు వేసింది. చంద్రబాబు నాయుడు మళ్లీ మళ్లీ సీఎం కావాలి.

- ఖాదర్ మస్తాన్, సంగం

### కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటాం..



ఆటోవాలాలకు ప్రభుత్వం ఏడాదికి ఇచ్చే రూ.15 వేలు ఇవ్వడం కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రస్తుతం రహదారులు బాగుపడడంతో ఆటోవాలాల ఆర్థిక పరిస్థితిని గమనించి ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించడం హర్షణీయం. కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటాం.

- షేక్ రసూల్, లక్ష్మీపురం, దుత్తలూరు

### రుణపడి ఉంటా...



తాను 20 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. ఏ ప్రభుత్వం గుర్తించని విధంగా కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను గుర్తించి వారికి రూ.15,000లు ఆర్థిక సాయం అందించటం అభినందనీయం. ఈ ప్రభుత్వానికి తాము రుణపడి, అండగా ఉంటాం.

-పీ. రాంబాబు, ఆటో డ్రైవర్, అల్లూరు

### చేయూతనివ్వడం హర్షదాయకం



నేను మూడేళ్లుగా ఆటో వేస్తున్నా. కూటమి ప్రభుత్వం ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటారు క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ. 15 వేలు ఆర్థిక చేయూతనందించడం ఎంతో సంతోషకరం. నగదును నేరుగా తమ ఖాతాల్లో జమ చేయడం ఆనందంగా ఉంది. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- వెంకటరమణ, ఆత్మకూరు

### అన్నివర్గాలకు సమన్యాయం

అల్లూరు: అన్ని వర్గాలకు సమన్యాయం చేకూర్చేదిశగా ప్రభుత్వం పని చేస్తోందని, అందులో భాగంగానే ఆటో డ్రైవర్లకు సాయం అందిస్తున్నదని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. శనివారం అల్లూరు ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆటో డ్రైవర్లతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బీ.శ్రీనివాసులు రెడ్డి, రేబాల శంకరరెడ్డి పాల్గొన్నారు.

### గడ్డుకాలంలో ఊరట



ఉచిత బస్సుకు అలవాటు పడిన మహిళలు ఆటోల వైపు చూడటం లేదు. ఇలాంటి గడ్డుకాలంలో కూటమి ప్రభుత్వం రూ. 15 వేల నగదు ఇవ్వడం మా కుటుంబాలకు ఎంతో ఊరట ఇచ్చినట్లు అయింది.

- ఎస్‌కే షరీఫ్, ఉలవపాడు

### హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు



ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.15,000/-ల చొప్పున అందించడం ఎంతో సంతోషానిచ్చింది. దీంతో నేను,నా కుటుంబం ఎంతో ఆనందిస్తున్నాం.

- షేక్ అహమ్మద్ బాషా, లింగసముద్రం

### ఆపద సమయంలో ఆదుకున్నారు..



దసరా సమయంలో ఇబ్బందులు పడుతున్న మమ్మల్ని సీఎం ఆదుకున్నారు. అసలే స్త్రీశక్తితో పథకంలో గిరాకీలు లేకుండా ఇబ్బంది పడుతున్న ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందించడం హర్షణీయం.

- కోవూరు శ్రీనివాసులు, ముత్తుకూరు

### ఇన్సూరెన్స్‌కు కలిసొచ్చాయి



సీఎం చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్ల ఖాతాకు జమచేసిన రూ.15వేలు ఐదేళ్లపాటు నా ఆటో ఇన్సూరెన్స్‌కి కలిసివచ్చాయి. సీఎం గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

- బూదూరు మధు, పోలినాయుడుచెరువు, బుచ్చి మండలం

## బైక్ ఢీకొని ఒకరి మృతి


కాకురు సుబ్బారెడ్డి (ఫైల్)

అనంతసాగరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల మేరకు కొత్తపల్లి పంచాయతీ కాకురు వారిపల్లికి చెందిన కాకురు సుబ్బారెడ్డి (55) తన మిత్రుడితో కలసి శుక్రవారం మినగల్లులో ఆంజనేయస్వామి విగ్రహ పతిష్ఠ కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి రాత్రికి స్వగ్రామానికి వస్తుండగా గ్రామ సమీపంలో కొత్తపల్లికి వస్తున్న మోటారుబైక్ ఢీకొనడంతో సుబ్బారెడ్డి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కండలేరులో మృతదేహం గుర్తింపు

కలువాయి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లకొండ సమీపంలోని సోమశిల కండలేరు (తెలుగుగంగ) కాలువ గట్టుపై గురువారం మోటారుసైకిల్ పెట్టి అదృశ్యమైన కలువాయి మండలం చింతలాత్మకూరుకు చెందిన నగేళ్ల రవి (25) మృతదేహాన్ని శనివారం కండలేరు జలాశయంలో స్థానికులు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం తెల్లవారుజామున కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలుపట్టాలపై జరిగింది. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి తెలుపురంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నలుపురంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకు తరలించారు. మృతుడి వివరాల కోసం కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కారు,ఆటో ఢీ : ముగ్గురికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

మర్రిపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న కారును వెనుక వైపు ఆటో ఢీకొనడంతో ఆటోలో వున్న ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన డీసీపల్లి టోల్ గేట్ సమీపంలో శనివారం ఉదయం జరిగింది. వలస కూలీలు ఆటోలో ఆత్మకూరు వైపు కూలి పనికి వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. గాయాలైన వారిని టోల్‌గేట్ వారి వాహనంలో చికిత్స నిమిత్తం స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సూచిక బోర్డును ఢీకొని కారు బోల్తా


ముళ్లపొదలో పడివున్న కారు

మర్రిపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు-నకిరేకల్ జాతీయ రహదారిపై సూచిక బోర్డును ఢీకొని కారు రోడ్డు పక్కన ముళ్లపొదల్లో బోల్తాపడిన సంఘటన చుంచులూరు వద్ద శనివారం జరిగింది. ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందినవారు పెంచలకోనలో దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వారి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవటంతో ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడిమేపల్లి రైల్వే గేటు వద్ద కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం, సురేష్ మోటారు బైకుపై పని నిమిత్తం ముత్తుకూరు మండలం పంటపాలెంలోని ఓ ప్యాక్టరీ వద్దకు వెళ్లారు. నెల్లూరుకు తిరిగి వస్తుండగా రైల్వే గేటు వద్ద సర్వేపల్లి వైపు వచ్చేందుకు మలుపు తిరుగుతుండగా ట్రాక్టర్ వచ్చి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలసుబ్రహ్మణ్యం, సురేష్ గాయపడగా, చికిత్స నిమిత్తం వారిని సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పిపోయిన బాలుడు సీపీపికి తరలింపు


ఆర్టీసీ ప్రధాన బస్టాండులో బాలుడిని దగ్గరకు తీసుకున్న సురేష్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గుర్తుతెలియని 8 ఏళ్ల బాలుడును శనివారం తెల్లవారుజామున ఆర్టీసీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఆర్టీసీ సిబ్బంది జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారిని బీ హేనసుజన్‌కు సమాచారం అందించారు. ఆమె ఆదేశాలతో జిల్లా బాలల సంరక్ష అధికారి బీ.సురేష్ బస్టాండుకు వెళ్లి బాబును చైల్డ్ అండ్ పోలీసు చిల్డ్రన్ హో మ్‌లో (సీపీపీ) చేర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ బాబుకు కౌన్సెలింగ్ ఇచ్చామని, తల్లిదండ్రుల వివరాలు తెలిసిన వెం టనే వారికి అప్పగిస్తామన్నారు. బాబు వివరాలు తెలిసిన వారు 9000 789793కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో ముంబాయి జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. ఓ వ్యక్తి మోటారుబైక్‌పై సంగం నుంచి ఆత్మకూరు వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రోడ్డు మీద గాయాలతో పడి ఉన్న వ్యక్తిని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కాన్వాయ్‌గా వెళ్తూ గమనించిన ఆత్మకూరు సీఐ గంగాధర్ కాన్వాయ్‌లో ఉన్న అనంతసాగరం ఎస్‌ఐకి తెలిపారు. దీంతో ఆయన గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. ఆ మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## ఇల్లు దగ్ధం : రూ.7 లక్షల ఆస్తి నష్టం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలలోని కొత్తమినగల్లు, పాతమినగల్లు మధ్య వున్న బీసీ కాలనీలో యువకుడు పట్టు ప్రతాప్ ఇల్లు శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ఘటనలో కర్పూరం, పూజ సామాన్లు ప్యాకింగ్ చేసే పరికరంతోపాటు, మెటీరియల్ మొత్తం కాలిపోయింది. ఇంటిలోనుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల ఇళ్లవారు యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రతాప్ తలుపులు తెరవగా కర్పూరం ప్యాక్ చేసే పరికరాలు, గృహోపకరణాలు, పూజ సామగ్రి దగ్ధమయ్యాయి. ఇల్లు మొత్తం కాలిపోయిందని యజమాని ప్రతాప్ వాపోయాడు. గడ్డ కర్పూరం నుంచి చిన్న బిళ్లలు చేసే పరికరమే రూ.5 లక్షలు చేస్తుందని, సామగ్రి మొత్తం కలిసి రూ. 7 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థించాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.



## వెంకయ్యస్వామి ఆశ్రమంపై వివాదాలు తగదు

**● అలాంటి వారిని స్వామే శిక్షిస్తారు ● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమంలో అవకతవకలు జరుగుతున్నాయని వస్తున్న విమర్శలలో వాస్తవం లేదని, వివాదాలు సృష్టించడం తగదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హితవు పలికారు. శనివారం నెల్లూరులోని వేదాయపాళెంలో తన క్యాంపు కార్యాలయంలో ఆయనను వెంకయ్యస్వామి భక్తులు, దాతలు కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. వెంకయ్యస్వామి ఆస్తులు రూ.200 కోట్లకు పెరగడంతో స్వామి బంధువుల పేరుతో కొందరు వివాదాలు సృష్టిస్తున్నారని చెప్పారు. సుదీర్ఘకాలం ఐఏఎస్ అధికారిగా, టీటీడీ జేఈవోగా ఎంతో నిజాయితీగా పనిచేసిన బాలసుబ్రహ్మణ్యంను ఉద్యోగ విరమణ అనంతరం ఇద్దరు చార్టెట్ అకౌంట్‌లు, భక్తులు, దాతలతో కలిసి 13 మంది కమిటీని హైకోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం నియమించిందన్నారు. కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక అధికారులుగా ఆశ్రమ నిర్వాహణను పర్యవేక్షిస్తారన్నారు. బాలసుబ్రహ్మణ్యం ముగ్గురు కుమారులు ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. ఈ క్రమంలో బాలసుబ్రహ్మణ్యం అవినీతికి పాల్పడుతున్నారని హైకోర్టుకు కొందరు ఫిర్యాదు చేయడం దురదృష్టకరమన్నారు. పైగా ఆయన కుమారులు రెండు ప్లాట్లు కొనుగోలు చేశారని వివాదాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనకు స్వామి భక్తులు అండగా నిలుస్తున్నారని, వివాదాలు చేసే వారిని వెంకయ్యస్వామే శిక్షిస్తారన్నారు.

## పీహెచ్‌సీల డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

**● వైద్యుల సంఘం నేత బ్రహ్మేశ్వర నాయుడు**



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీహెచ్‌సీల డాక్టర్ల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం నేత బ్రహ్మేశ్వరనాయుడు పేర్కొన్నారు. పీహెచ్‌సీలో 20, 25 ఏళ్లకు పైబడి పని చేస్తున్న వైద్యులు 5 రోజులుగా చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మేశ్వరనాయుడు మాట్లాడుతూ గత ఏడాది ఇవే సమస్యలపై సమ్మెకు దిగగా ప్రభుత్వం కొంత గడువు కోరిందన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో మళ్లీ సమ్మెబాట పట్టామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి ఉద్యోగోన్నతి లేదన్నారు. తక్షణమే టైంబౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని, జీవో 90ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు 50 శాతం మూలవేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ జ్యోతిరాణి, విజయలక్ష్మి, సాయి ప్రియాంక, రమ్య, మనోజ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవలపై ఎంపీపీ ఆగ్రహం

కలిగిరి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ మెట్టుకూరి శిరీష ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్యసమావేశం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంపై పలుమార్లు హెచ్చరించినా వైద్యాధికారి తీరు మారలేదని, ఈ విషయమై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామాలలో అపరిశుభ్రత, మంచినీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో ప్రత్యూష, మండల అధికారులు పాల్గొన్నారు.


## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోషియేషన్ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రపదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు 2024 నవంబరు నుంచి ఇప్పటి వరకు గ్రాట్యుటీ చెల్లింపులు జరగకపోవడం వలన రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటున్నారని ఏపీఎస్ ఆర్టీసీ పీటీడీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్‌టీసీ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేకపోవడం వల్ల, గ్రాట్యుటీ రాకపోవడంతో నిత్యావసరాలు కూడా తెచ్చుకోలేని పరిస్థితిలోకి వెళ్లారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీటీడీ రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనార్థం ఆమోదించిన ఈహెచ్‌ఎస్ స్కీమ్ ఇప్పటి వరకు అమలు చేయకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఇలా అనేక సమస్యలతో రిటైర్డ్ పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన సురేష్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు, కూటమి నాయకులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ కార్యదర్శి జగదీశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలి

**● రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి**


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన వచ్చే స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో బీసీ రిజర్వేషన్‌పై వామపక్ష పార్టీలు, బీసీ సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడారు. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా రాజకీయ పార్టీలు కేంద్ర, రాష్ట్రాలపై వత్తిడి తీసుకురావాలన్నారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న వత్తిడి కారణంగా బీసీల జనగణన చేపడతామని ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వడ్డెర సంఘం కార్యదర్శి గుంజి దయాకర్, నాగేశ్వరరావు యాదవ్, భాస్కర్‌లు మాట్లాడుతూ జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 50 శాతం జనాభా ఉన్నా ఒక్క బీసీకి కూడా పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వక పోవడం సరికాదన్నారు. ఇలాంటి స్థితిలో బీసీలకు న్యాయం జరిగే వరకు గ్రామస్థాయి నుంచి పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పముజుల దశరథరామయ్య, నందిపోగు రమణయ్య, మాలకొండయ్య, వినోదమ్మ, రామరాజు, సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, కటికాల వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ నాయకులు సాగర్, రాంబాబు, పార్వర్డ్ బ్లాక్ కన్వీనర్ నరసింహులు, లీలామెహన్ పాల్గొన్నారు.

## జాతీయ పతాకమంటే అంత అలుసా!?


బెంచీపై పడేసిన జాతీయ పతాకం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సమయంలో జాతీయ పతాకాలను ఎగురవేసి పొగడ్తలతో ముంచెత్తే అధికారులు ఆపై ఏమాత్రం గౌరవం లేకుండా వ్యవహరిస్తుండడం దారుణం. అందుకు నిదర్శనమే కాంచెరువు సచివాలయంలో ఉద్యోగులు వ్యవహరించిన తీరు. ఇటీవల ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించిన అక్కడి ఉద్యోగులు అనంతరం జాతీయ పతాకాన్ని భద్రపరచకుండా గదిలోని ఓ బెంచీపై పడేయడంతో వారి పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. తాముండే గదిలోనే రోజుల తరబడి జాతీయ పతాకం దుమ్ము, ధూళితో నిండి ఉండడాన్ని చూసిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించి జాతీయ పతాకం పవిత్రతను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 138 |
| స్కిన్ చికెన్ | 246 |
| స్కిన్‌లెస్ | 270 |

కోడిగుడ్ల ధర (100) : 520

**బంగారం, వెండి ధరలు**

| బంగారం (22 క్యారెట్లు) | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.11,273 |
| వెండి కిలో ధర | రూ. 1,51,500 |
| వెండి ఒక గ్రాము | రూ.155.50 |

### కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

కావలి రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెం కోదండరామస్వామి ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కోదండరామస్వామికి మంగళహారతి మొదలైన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఉదయం యాగశాల ప్రవేశం, కుంభస్థాపన, శ్రీరామ మూలమంత్ర హోమం, మంగళస్నానం, సాయంత్రం పంచసూక్తహోమం, సామూహిక లక్ష తులసి దళార్చన, మంగళహారతి తదితర పూజలు నిర్వహించనున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): 167బీ జాతీయ రహదారిపై మండలంలోని పలుకూరు సమీపంలో రవి గార్డెన్స్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొదిలి భార్గవనాథ్ (25) అనే యువకుడు దుర్మరణం చెందాడు. భార్గవ్‌నాథ్ మోటారుసైకిల్‌పై కందుకూరు నుంచి ఒంగోలు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. భార్గవ్‌నాథ్ కొరియర్ బాయ్‌గా కందుకూరులో విధులు పూర్తిచేసుకుని తిరిగి ఒంగోలు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆర్టీసీ డ్రైవరు పరారీలో ఉన్నాడు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే రూరల్ ఎస్‌ఐ మహేంద్రనాయక్ ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

కొండాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ బీసీ కాలనీలో దసరా రోజు బండారు సుధాకర్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుడి బంధువులు, గ్రామస్థులు శనివారం డిమాండ్ చేశారు. హంతకులను అదుపులోకి తీసుకునేంతవరకు మృతదేహానికి అంత్యక్రియలు జరగనివ్వబోమని మృతుడి సోదరులు బండారు ప్రసాద్, రమేష్, శ్రీనివాసులు, కొండయ్య, మల్లె చిన్నయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య మల్లేశ్వరి అక్రమసంబంధం పెట్టుకున్న సానంగుల రవి, మల్లేశ్వరి అన్న తురకా మాధవ, భార్య సునీత, లక్ష్మీకాంతమ్మ, మల్లె వేణు మరికొంత మందితో కలసి సుధాకర్‌ను చంపి ఉరి వేశారన్నారు. ఎస్‌ఐ మాల్యాద్రి న్యాయం చేస్తామని చెప్పడంతో నిరసన విరమించి, సుధాకర్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

## ఆటోడ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు : ఇంటూరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో అనే నూతన సంక్షేమ కార్యక్రమాన్ని ప్రకటించి ఆటో డ్రైవర్లందరికీ రూ. 15వేలు చొప్పున ఆర్థికసహాయాన్ని రాష్ట్రప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిన సందర్భంగా శనివారం కందుకూరులో విజయోత్సవ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆటోలన్నీ స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి ఏఎంసీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే స్వయంగా ఆటోడ్రైవరు యూనిఫాం వేసుకుని ఆటో నడుపుతూ సందడిచేశారు. అనంతరం మార్కెట్‌యార్డు ఆవరణలో సభ నిర్వహించి చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం ఆటోడ్రైవర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా నూతన పథకాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. అనూష, ఆర్డీవో టీవీఎస్ లక్ష్మీ, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శంకర్రావు, సురేష్, ఓబులేషు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమెట్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## విలేకరి స్థలం ఆక్రమణ దారుణం : సీపీఐ

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవూరు రోడ్డులో ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలలో సీనియర్ జర్నలిస్టు కె హరిబాబు స్థలాన్ని దురాక్రమణ చేయటం దారుణం అని సీపీఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ దురాక్రమణ జరిగిన స్థలాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటన్న ఆందోళన కలుగుతోందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ నాయకులు బి.సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్, మురళి, నరసయ్య, దుర్గాప్రసాద్, మాధవరావు, మురళి, లక్ష్మీనారాయణ, బాలబ్రహ్మాచారి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### బిజిల్ యాప్ ద్వారా ఇంటి వద్దకే అన్ని సేవలు

కావలి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఇంటి వద్దకే అన్ని సేవలు అందేలా బండి అమర్ రెడ్డి రూపొందించిన బిజిల్ యాప్‌ను శనివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. కావలి ప్రజలు టెక్నాలజీని సద్వినియోగం చేసుకునే విధంగా యాప్‌ను రూపొందించారన్నారు. ఈ యాప్ ద్వారా ఆహర పదార్థాలు, గృహోపకరణాలు.. ఇలా అన్ని రకాల సేవలు ఇళ్ల వద్దకే వచ్చి అందిస్తారని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### 'పోషణ్' మాసోత్సవాలు

కలిగిరి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): 'పోషణ్' మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని నాగసముద్రం, చినలన్నలూరు సచివాలయ పరిధిలోని తూర్పుమాలపాలెం అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరోగ్యరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

### వేరుశనగ నూతన వంగడంతో అధిక దిగుబడులు

ఉలవపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ నూతన వంగడం టీఏజీ-73 రకంతో అధిక దిగుబడి సాధించవచ్చని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు తెలిపారు. కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం గ్రామంలో శనివారం వేరుశన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీఏ శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతి, మాయాంక్, వివేక్, ఆర్‌ఎస్‌కే సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### దేవకికి ఘన సన్మానం

కందుకూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబర్‌గా నియమితులైన ఆల్ ఇండియా వాసవీసత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లును కందుకూరు ఆర్యవైశ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. మండల ఆర్యవైశ్యసంఘం కన్వీనర్ మురారిశెట్టి సుధీర్‌కుమార్, చక్కా కేశవరావు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, గుర్రం చినఅల్లూరయ్య, మానేపల్లి బుచ్చయ్య, సిరి షాపింగ్‌మాల్ శివ తదితరులు దేవకి వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపి సత్కరించారు.

### క్యాడెట్ మహిల్‌కు సత్కారం

కావలి (టౌన్) అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంటకరావునగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి 10 ఆంధ్ర నావెల్ యూనిట్‌కు చెందిన బండి మహిల్ అభినందనలందుకున్నారు. పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, నావెల్ యూనిట్ ఏఎన్ఓ థార్డ్ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి, ఉపాధ్యాయులు మహిల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిల్ కుని, ఉత్తమ క్యాడెట్ అవార్డు అందుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్‌గోదాం ప్రోత్సాహంతో ఎంపికయ్యాడని చెప్పారు.

## ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుంది


ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే దగుమాటి, వెనుక కూర్చున్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్

కావలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తగిన చేయూతను అందిస్తోందని, కావలిలో వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకంలో భాగంగా శనివారం పట్టణంలో ఆటో డ్రైవర్లు సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆటోలతో సంఘీబావ ర్యాలీ నిర్వహించారు. ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై ట్రంకు రోడ్డు మీదుగా మద్దూరుపాడులోని ఎస్‌ఎంకే కన్వెన్షన్ హాలు వరకు సాగింది. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆటో కార్మికుని చొక్కా ధరించి ఆటో డ్రైవర్లతో మమేకమయ్యారు. ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను ఆటోలో ఎక్కించుకుని ఎమ్మెల్యే స్వయంగా ఆటో నడిపడం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఎస్‌ఎంకే కన్వెన్షన్ హాలులో ఆటో డ్రైవర్లు, టీడీపీ నేతలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీవంశీక్రిష్ణ, డీఎస్పీ పీ. శ్రీధర్, ఆర్డీవో మురళీధర్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్, కావలి, బోగోలు ఎంపీడీవోలు శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, సీఐలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా ఉప్పుటూరి సుబ్బలక్ష్మి

కావలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆశీస్సులతో శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా కావలికి చెందిన రాష్ట్ర బీసీ సెల్ అధికారప్రతినిధి, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు ఉపుటూరు బాలగురుస్వామి సతీమణి సుబ్బలక్ష్మిని నియమించారు. దీంతో శనివారం సాయంత్రం ఆమె ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఉపుటూరి బాలగురుస్వామి, పెనుబాపల వెంకటేశ్వర్లు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా

కావలి (టౌన్) అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం ట్రంక్ రోడ్డులోని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈనెల 7న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు పువ్వాడి వెంకటేశ్వర్లు, మణిసుబ్బు, మాధవరావు, ఐహెచ్‌ఎల్ ప్రసాద్, సుదర్శనం, లక్ష్మయ్య, చిరంజీవి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### సూపర్ జీఎస్టీ 2.0పై అవగాహన కలిగి ఉండాలి

కావలి (టౌన్) అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0పై శనివారం స్థానిక జీఎస్టీ కార్యాలయంలో వ్యాపార ప్రముఖులతో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్‌ఏసీ) వరప్రసాద్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ 2.0పై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నూతన జీఎస్టీ విధి విధానాలు, అమలు తీరుపై వ్యాపారస్తులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జీఎస్టీ గ్రీవెన్స్ బోర్డు సభ్యులు అమరా సుబ్బారావు, వ్యాపార ప్రముఖులు మద్దుల నరసింహారావు, బచ్చు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కున్న ఘనత వైసీపీదే

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు ఒక చేత్తో రూ.10 వేలు ఇచ్చి.. జరిమానాల రూపంలో మరో చేత్తో రెట్టింపు వసూలు చేసిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానిదేనని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నియోజకవర్గ టీడీపీ నాయకులు, ఆటోవాలాలతో కలిసి ఉదయగిరి పట్టణంలోని గండిపాళెం సర్కిల్ నుంచి పట్టణ పురవీధుల గుండా కోటంరెడ్డి ఆటో నడుపుతూ టీటీడీ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 1,406 మంది ఆటో డ్రైవర్లకు రూ.2.10 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. తొలుత ఆటో యూనియన్ నాయకులను సన్మానించి అనంతరం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ కార్యదర్శి మాలేపాటి చైతన్య, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, కూటమి నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, గడ్డం వెంకటేశ్వర్లు, మట్ల శాంతి, నల్లిపోగు రాజా, నరసింహ, కొట్టే వెంకటేశ్వర్లు, కదిరి రంగారావు, ఎల్‌సీ రమణారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, చంద్ర మధు, కలివెల జ్యోతి, సర్ఫుద్దీన్, శివకృష్ణ, అన్ని మండలాల టీడీపీ కన్వీనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రవాణా శాఖాధికారులు, ఆటోవాలాలు తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి: ఆటోవాలాలకు చెక్కు అందజేస్తున్న కోటంరెడ్డి, కంభం, కూటమి నాయకులు, అధికారులు


ఆత్మకూరు : సభలో మాట్లాడుతున్న ఆర్డీవో బి పావని

### ఆటో డ్రైవర్ల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఆర్డీవో

ఆత్మకూరు : ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆత్మకూరు ఆర్డీవో బి పావని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులైన ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ. 15వేలు ఆర్థిక సహాయం అందుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 1636 మంది లబ్ధిదారులను ఎంపికచేసి వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి తదితరులు మాట్లాడుతూ అర్హులై ఉండి పథకం అందకపోతే ఫిర్యాదుల స్వీకరణకు ప్రభుత్వం వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం కింద ఆర్థి చేయూతనందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూన చెక్కును అందజేశారు. ముందుగా స్థానిక నెల్లూరుపాళెం సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఆటోలతో డ్రైవర్లు, టీడీపీ, బిజెపి, జనసేన నేతలు, కార్యకర్తలు, అధికారులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ సీనియర్ నేతలు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, వల్లూరు వెంకటరమణారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచల చౌదరి, దావా పెంచలరావు, చంద్రా వెంకటసుబ్బానాయుడు, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు, అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్డీయే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. సమస్యల అధ్యయనంలో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన వారు సంగంలో పర్యటించారు. చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దశరథరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి, చేనేత నాయకులు ఆకురాతి లక్ష్మీకాంతం, రిటైర్డ్ ఎమ్మార్వో సానం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## 7న రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయండి


ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు, బాధ్యులు

ఆత్మకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈనెల 7న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ సురేంద్రరెడ్డి, ఎస్ భాస్కర్‌రెడ్డి, ఎం గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి వద్ద ఫ్యాప్టో సభ్యసంఘాల బాధ్యులు ధర్నా పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో బాధ్యులు బి శివప్రసాద్, ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, జె కొండయ్య,ఐ చంద్రమోహన్‌రెడ్డి, ఎస్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనులపై గ్రామసభ


గాంధీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన 2026-27 ఏడాదికి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామసభకు ముందు గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గత సంవత్సరం ఉపాధి హామి పథకంలో చేపట్టిన పనుల గురించి, ప్రస్తుతం జరిగే పనుల గురించి వివరిం చారు. అనంతరం ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ ఫేస్ యాప్‌ల గురించి ఉపాధి హామి శ్రామికులకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ నరేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### సర్పంచు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ఆనం


సర్పంచు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ఆనం

అనంతసాగరం అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు సర్పంచు బుట్టి భారతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు. సర్పంచు భారతమ్మ మృతికి సంతాపం తెలిపారు.

### దేవిశెట్టిని పరామర్శించిన నుడా చైర్మన్

వింజమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వింజమూరులోని ప్రధాన రహదారిలో నివాసముంటున్న బాలకృష్ణ వీరాభిమాని దేవిశెట్టి కృష్ణ, పెరుమాళ్ల ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న బాలకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షులు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాలేపాటి చైతన్య, బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, సొసైటీ డైరెక్టర్ గని శ్రీనివాసులునాయుడు, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి ఎల్‌సి రమణారెడ్డి, కటకం ప్రసన్నకుమార్, రవి, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

### డిజిటల్ మార్కెటింగ్‌లో యువతకు ఉచిత శిక్షణ

ఉదయగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాక్ శిక్షణా కేంద్రంలో పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్రం నిర్వాహకులు లక్కినేని ప్రకాష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలలపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి 17 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత స్టేషనరీ, దూరప్రాంతం నుంచి వచ్చే వారికి ఉచిత వసతి కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9177327797 అనే సంప్రదించాలని ఆయన కోరారు.

### పాఠ్యపుస్తకాల పంపిణీ

సీతారామపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, ప్రవీణా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, కొండయ్య, వెంకటసుబ్బయ్య, సీఆర్పీలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో లలితా రుద్ర మహాయజ్ఞం

సంగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం చేపట్టిన లలితా రుద్ర మహాయజ్ఞం శనివారం 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యజ్ఞంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.




తిరుపతి మధురానగర్ వీధుల్లో నిలిచిన వర్షపు నీరు



తిరుపతిలోని రైల్వే అండర్ పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరు



తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ నుంచి పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లే దారిలో వాహనదారుల ఇక్కట్లు




తిరుపతి వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్ వద్ద ప్రవహిస్తున్న నీరు

# కుండపోత

## 27 మండలాల్లో సగటున 31.8 మి.మీ. వర్షపాతం

### రేణిగుంటలో నిండిన పలు చెరువులు

### వెంకటగిరి, బాలాయపల్లెలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

### తిరుపతిలో నీట మునిగిన రైల్వే అండర్ పాస్‌లు.. వీధులు జలమయం

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. 34 మండలాలకుగానూ 27 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా వడమాలపేట మండలంలో 87.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 31.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. దాదాపుగా అన్ని మండలాల్లోనూ శనివారం వేకువజామున మొదలైన వర్షం ఉదయం 10 గంటల వరకూ కురిసింది. వెంకటగిరిలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోగా బాలాయపల్లి మండలం పాకూడి గ్రామంలో తాటి చెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడింది. తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తిలో వర్ష తీవ్రతకు అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తిరుపతిలో వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ మోస్తరు వాన కురిసింది. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న, వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే అండర్ పాస్‌లు నీట మునిగి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. లక్ష్మీపురం కూడలి నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు వరకూ జలమయమైంది. అశోక్‌నగర్, అబ్బన్న కాలనీ వీధులు చెరువులను తలపించాయి. ఆ ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రేణిగుంటలో శనివారం తెల్లవారుజాము 2.30 నుంచి ఉదయం 11 వరకూ వర్షం కురిసింది. దానికి తోడు తిరుపతి నుంచి వచ్చి పడిన వర్షపు నీరు తోడు కావడంతో వెంకటాపురం, అన్నాస్వామిపల్లి, కరకంబాడి, మాదివానికుంట చెరువులు నిండి కలుజులు పారాయి. నారాయణవనంలో కురిసిన వానకు అరుణానది కల్వర్టులపై నీరు పొంగి ప్రవహించింది. పలు గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి. పుత్తూరు మండలం మూలనకోనలో వర్షపు తీవ్రతకు ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో అటవీ శాఖ అధికారులు చెక్‌పోస్టు మూసివేసి రాకపోకలు నిలిపివేశారు.



తిరుపతి కపిలతీర్థం నుంచి జాలువారుతున్న జలపాతం

**వడమాలపేటలో 87.4 మి.మీ**

జిల్లాలో 27 మండలాల్లో శనివారం వర్షపాతం నమోదైంది. వడమాలపేటలో 87.4 మిల్లీమీటర్లు, తిరుపతి రూరల్ 85.8, చంద్రగిరి 82.4, తిరుపతి అర్బన్ 75.8, తొట్టంబేడు 75.2, శ్రీకాళహస్తి 58.2, వరదయ్యపాలెం 55.2, సూళ్లూరుపేట 54.2, రేణిగుంట 54, నారాయణవనం 52.8, రామచంద్రాపురం 45.2, బీఎన్ కండ్రిగ 42.6, కేవీబీపురం 41.8, పిచ్చాటూరు 41.6, పుత్తూరు 41.4, చిన్నగొట్టిగల్లు 40.6, ఎర్రావారిపాలెం 35.8, ఏర్పేడు 27.2, పాకాల 24.4, నాగలాపురం 15.2, సత్యవేడు 11.4, తడ 10.6, చిట్టమూరు 8.2, వాకాడు 7.8, పెళ్లకూరు 3.8, దొరవారిసత్రం 1.2, నాయుడుపేటలో 0.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. వెంకటగిరి, చిల్లకూరు, డక్కిలి, బాలాయపల్లి, గూడూరు, కోట, ఓజిలి మండలాల్లో మాత్రం వర్షం పడలేదు.



## తిరుమలలోనూ జోరు వర్షం



ఆలయం ముందు దంచికొడుతున్న వర్షం

తిరుమల (ఆంధ్రజ్యోతి): తిరుమలలోనూ శనివారం వర్షం జోరుగా కురిసింది. వేకువజాము 5 నుంచి ఉదయం 8 గంటల వరకు భారీగా పడింది. శ్రీవారి దర్శనానికి వెళ్లేవారితోపాటు ముగించుకుని వెలుపలకు వచ్చిన భక్తులు వర్షంలో తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పెరటాసి మాసం మూడో శనివారం కావడంతో తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. దర్శనం కోసం బాటగంగమ్మ సర్కిల్ సమీపంలోని క్యూలోకి ప్రవేశించే క్రమంలో భక్తులు తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. శ్రీవారిమెట్టు కాలినడక మార్గంలో వర్షపు నీరు జోరుగా ప్రవహించింది. మార్గం మధ్యలోని పక్కనే ఉన్న కాలువ ద్వారా వర్షపు నీరు వేగంగా ప్రవహిస్తూ మెట్లపైకి రావడంతో కాలినడక భక్తులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 9 గంటల తర్వాత వర్షం పూర్తిగా నిలిచిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, తిరుమలలో చలి వాతావరణం పెరిగింది.

## తిరుపతిలో చైన్‌స్నాచర్ల హల్‌చల్

● ఐదుగురు మహిళల నగలను లాక్కెళ్లిన వైనం




సీసీ కెమెరాలో దొంగలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సాయంత్రం చైన్ స్నాచింగ్ ముఠా చెలరేగింది. ఇద్దరు ఆగంతకులు ముసుగులు ధరించి మహిళల మెడల్లో బంగారు గొలుసులు దోపిడీ చేశారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో తిమ్మినాయుడుపాళెం సమీపంలో కాపురమున్న నాగభూషణమ్మ మంగళం రోడ్డులో వెళుతుండగా గరుడాద్రినగర్ వద్ద బైక్‌లో వచ్చిన ముసుగు దొంగలు ఆమె మెడలో వున్న 48 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. ● అలిపిరి పరిధిలోని గొల్లవానిగుంట వద్ద సరస్వతమ్మ ఇంటి ముందు కూర్చుని వుండగా ఆమె మెడలోని 50 గ్రాముల బంగారు చైన్లు రెండు లాక్కొని పారిపోయారు. ● ఉపాధ్యాయనగర్‌కు చెందిన రాధ ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలోని 38 గ్రాముల చైను లాక్కొని పరారయ్యారు. ● మంగళం రోడ్డులోని గంగారాం ఫంక్షన్ హాలు వద్ద రోడ్డుపై నిలుచుని ఉన్న మంజుల మెడలోని 26 గ్రాముల చైను లాక్కొని ఉడాయించారు. ● పోస్టల్ కాలనీకి చెందిన కె.జయశ్రీ ఇంటికి నడుచుకుని వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆమె మెడలోని 52 గ్రాముల మూడు బంగారు చైన్లు లాక్కొని వెళ్లిపోయారు. నిందితులు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సున్న యువకులుగా ఉన్నారని, సీసీ ఫుటేజీ ఆధారంగా వారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని డీఎస్పీ భక్తవత్సలం తెలియజేశారు. రేపటిలోగా నిందితులను పట్టుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఇకపై మళ్లీ ఇలాంటివి జరగకూడదని హెచ్చరించారు.

## ఇస్కాన్‌కు బాంబు బెదిరింపు

### తిరుపతిలోని మూడు ప్రాంతాల్లో ఆర్‌డీఎక్స్ పెట్టామంటూ మెయిల్స్



తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని ఇస్కాన్ ఆలయంతోపాటు మరో రెండు ప్రాంతాల్లో బాంబులు పెట్టామని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మెయిల్స్ వచ్చాయి. తమిళనాడు రాష్ట్రం కరూర్ ఘటనను సీబీఐకి అప్పగించాలని అందులో పేర్కొంటూ డిప్యూటీ ఈవో డోనర్ సెల్.తిరుమల.ఓఆర్‌జీ పేరుతో, ఇస్కాన్ తిరుపతి పేరుతో మెయిల్స్ వచ్చాయి. శబరీష్ వేదమూర్తి పేరుతో శుక్రవారం అర్ధరాత్రి మెయిల్స్ రావడంతో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ అధికారి బీరయ్య ఇస్కాన్ ఆలయంలో తనిఖీ చేశారు. తిరుపతి, తిరుమలలో భక్తులు తిరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బాంబుల జాడ కనిపించకపోవడంతో ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు.

### మ్యానిఫెస్టోలో లేకున్నా

# ఆటో డ్రైవర్లకు సాయం

## జిల్లాలో 14,375మందికి రూ.21.56 కోట్ల జమ



ఆటో డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లంతా సంతోషంగా ఉన్నారని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం తరహాలో వీరికి ఎలాంటి వేధింపులూ లేవన్నారు. రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్‌లూ లేవన్నారు. కార్మికుల, కర్షకుల పక్షాన తమ ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందన్నారు. శనివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో..' కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ప్రస్తావించకున్నా ఆటో డ్రైవర్లకు రూ.15వేలు చొప్పున అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే 16 పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద జిల్లా వ్యాప్తంగా 14375మంది ఆటో యజమానులకు రూ. 21.56 కోట్ల మెగా చెక్కును మంత్రి లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం .పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తోందన్నారు. ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురైతే తీర్చడానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధతో వారి కుటుంబాలు భద్రంగా ఉంటాయన్నారు. ఆటోడ్రైవర్ల నడవడిక, ఆరోగ్యానికి సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

**వరుసగా ఫలితాలు..**

ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కృషి ఫలితాలు ఒక్కొక్కటిగా అందుతున్నాయన్నారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఈ పథకం ఆటోడ్రైవర్ల జీవితాలలో వెలుగులు నింపుతుందన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నాయీ బ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ ఒడిదుడుకులు ఎదురైనా కూటమి ప్రభుత్వం సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తోందన్నారు. రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి.కృష్ణవేణి మాట్లాడుతూ అర్హులుంటే ఈపథకం వర్తింపచేస్తామన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్, ఆర్డీవో మురళీమోహన్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్లు, తాగునీటి కోసం రూ.80కోట్లు

### తిరుపతి మున్సిపల్, తుడా అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ



తిరుపతి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి) : తిరుపతిని మెగా సిటీగా మార్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాబోయే రెండేళ్లలో తిరుపతిలో డ్రైన్లు, ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, దీనికోసం రూ.80కోట్లు కేటాయించనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. శనివారం రాత్రి తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ, తుడా అధికారులతో సమావేశమయ్యారు. కమిషనర్ మౌర్య కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. డ్రైన్లు లేని ప్రాంతాలను అడిగి తెలుసుకుని వాటి నిర్మాణం కోసం అయ్యే ఖర్చుతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. రోడ్ల శుభ్రత కోసం మిషన్లపై ఆధారపడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. తుడా వీసీ శుభం బన్సల్ తుడా ప్రగతిని వివరించారు. శెట్టిపల్లిలో తుడాకు రావాల్సిన 65 ఎకరాలతో పాటు రెవెన్యూ వాటా 90 ఎకరాలు కూడా తుడాకు వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు మంత్రి చెప్పారు. తుడా టవర్స్‌లో ప్లాట్లు మందకొడిగా అమ్ముడుపో తున్నాయని, ధర సవరణపై కమిటీని నియమించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నగరంలో ప్రాధాన్యత పనులు పూర్తయిన వెంటనే సీవోసీ బిల్డింగ్ పూర్తి చేస్తామన్నారు. తిరుమల వర్షపునీరు మళ్లింపుపైనా చర్యలు తీసుకుంటామని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ కాపు, బీసీ భవన్‌లను పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్‌బాబు పాల్గొన్నారు.



## మానవాళి శ్రేయస్సుకే అంతరిక్ష ప్రయోగాలు

### స్పేస్ వాక్ ప్రారంభోత్సవంలో షార్ డైరెక్టర్ పద్మకుమార్



స్పేస్‌వాక్‌ను ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడతాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. శనివారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతరిక్ష నడక (స్పేస్ వాక్) కార్యక్రమాన్ని సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జూనియర్ కళాశాల మైదానం నుంచి షార్ ఉద్యోగుల కాలనీ స్వర్ణముఖినగర్ డీవోఎస్ కాలనీ వరకు స్పేస్ వాక్ నిర్వహించారు. ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలను ఊరేగించారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రాముఖ్యత గురించి షార్ డైరెక్టర్ విద్యార్థులకు వివరించారు. షార్ కంట్రోలర్ ముత్తు చెరియన్, కంట్రోలర్ రమేష్ బాబు, ఎంఎస్‌ఏ డీడీ గోపీకృష్ణ పాల్గొన్నారు.

### నవంబరు నుంచి

## విద్యుత్ చార్జీల తగ్గింపు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో 9,26,150 మందికి నవంబరు నుంచి గతంలో అధికంగా వసూలు చేసిన రూ.63.19 కోట్ల ట్రూఅప్ చార్జీలను తిరిగి చెల్లించడానికి రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈ వి.చంద్రశేఖరరావు, ఎస్ఏవో ఎ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఎస్ఈ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు వినియోగదారుల నుంచి ఎఫ్‌పీపీసీఏ చార్జీలు (ట్రూఅప్ చార్జీలు)గా వసూలు చేసిన మొత్తంలో విద్యుత్ కొనుగోలు ధరల సర్దుబాటు(ఎఫ్‌పిపిసిఏ)కు పోను మిగిలిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. ఈ సర్దుబాటు నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకూ ప్రతినెలా వినియోగ బిల్లుల్లో తగ్గిస్తారని చెప్పారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కురుగొండ్ల



ఆటో డ్రైవర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చడమే కాకుండా అన్నివర్గాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు దసరా కానుకగా రూ.15వేలు ఇవ్వడమే జరిగిందన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినందుకు కృతజ్ఞతగా ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. అంతకుముందు స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో పాటు టీడీపీ శ్రేణులు ఆటోల్లో ర్యాలీగా బయలుదేరి ఎస్ఆర్ గార్డెన్‌కు చేరుకొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా రెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు, సీఐ రమణ, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణారెడ్డి, కూటమి నాయకులు పలికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, సీసీ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళి రెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, గుత్తికొండ బాబు నాయుడు, మంకు ఆనంద్, గొల్లగుంట వెంకటముని, రామారావు అనిల్, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్లు 20శాతానికి పెంచాలి



కేంద్రమంత్రి రామ్‌దాసు అథవాలేకు వినతిపత్రం అందజేస్తున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లు 20శాతానికి పెంచాలని కోరుతూ కేంద్ర సామాజిక సాధికార మంత్రి రామ్‌దాసు అథవాలేకు శనివారం మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు, బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్ ప్రధాన కార్యదర్శి యంత్రపాటి శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. తిరుపతిలోని ఓ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్రమంత్రిని కలిసి ఎస్సీ రిజర్వేషన్ల గురించి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషన్లు 20శాతానికి పెంచడంతో పాటు దళిత క్రిష్టియన్‌లకు ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని, క్రిమి లేయర్‌ను రద్దు చేయాలని, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలజాతికి జరుగుతున్న అన్యాయాన్ని జాతీయస్థాయిలో చర్చించి తగు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, బహుజన నాయకులు పాలా మల్లికార్జున్, పనబాక హేమంత్, క్రాంతి కుమార్, నవీన్, స్టాలీన్, సూర్య, గిరి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

చిట్టమూరు, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తగంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం వేద పండితుల మంత్రోత్సరణల నడుమ నెయ్యి, తేనే, కుంకుమ, గంధం, వివిధ రకాల పండ్లతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. తరువాత గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి గణపర్తి కిషోర్ నాయుడు, సునీత, అన్నప్రసాద వితరణకు వాకాటి రమణయ్య, శేషమ్మ, అభిషేక కార్యక్రమాలకు వలిపి రమణయ్య, కవిత ఉభయకర్తలు నిర్వహించారు.

## లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

గూడూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనధికార లే అవుట్లను, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. దివిపాళెం, పోటుపాళెం గ్రామాల్లోని పలువురు క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, వీటిపై ఏవైనా అభ్యంతరాల ఉంటే 15 రోజుల లోగా మున్సిపల్ కార్యాలయంలో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఏడుకొండలు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఏడుకొండలు హెచ్చరించారు. శనివారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. రాత్రిళ్లు ఆకతాయిలు బైక్ రైడింగ్ చేస్తున్నారని, వారిని సీసీ కెమెరాల్లో గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## శాకాంబరి అలంకారంలో శ్రీనివాసుడు



సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయంలో జరుగుతున్న పెరటాశి మాస ఉత్సవాల్లో భాగంగా మూడో శనివారం సందర్భంగా వేంకటేశ్వరస్వామి శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేసి పుష్పాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## కారు ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బిరదవాడ గ్రామానికి చెందిన సుందరం(68) శుక్రవారం రాత్రి నాయుడుపేట పట్టణంలో పనులు ముగించుకొని ఆటోలో బిరదవాడకు వెళ్లాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుందరంను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెల్లుతండగా మార్గమధ్యంలో సుందరం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

చిల్లకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపనూరు గ్రామ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చెన్నై వైపు వెళుతున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుదర్శనరావు తెలిపారు.

## రెండు వర్గాల మధ్య ఘర్షణ

చిల్లకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాల పాడు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన సుధాకర్, పరుశురామ్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. సుధాకర్ వర్గానికి చెందిన మణికంఠయ్య, చిరంజీవి, పరశురామయ్య, వెంకటరమణయ్య, పరశురామ్ వర్గానికి చెందిన మనోజ్, యశ్వంత్, జనార్దన్, పోలయ్య, వెంకటరమణయ్య, వజ్రమ్మ పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో సుధాకర్, పరుశు రామ్‌లకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మెమో

గూడూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మనేటూరు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌కు శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో కౌసల్య మెమో జారీ చేశారు. సచివాలయ పరిధిలో 64 మందికి వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ పింఛన్ నగదు అందజేయలేదని లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాకేష్‌కు మెమో జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చెప్పారు.





సిద్దాగుంటలో దుక్కి చేసిన ప్రభుత్వ భూమి - గొల్లగుంటలో అటవీ భూమిని చదును చేస్తున్న ఎక్స్‌వేటర్

# యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

- ఆక్రమించి అమ్మేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

బాలాయపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా కబ్జా చేసి చదును చేసేస్తున్నారు. వెంకటగిరి మండలం బంగారుపేట నుంచి బాలాయపల్లి మండలంలోని నిడిగల్లుకు వెళ్లే మార్గంలోని సిద్దాగుంట గ్రామం పరిధిలో తారురోడ్డు ఆనుకుని ఉన్న లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిపై కన్నేసిన వేసిన ఆక్రమణదారులు కబ్జా చేసి చదును చేసేశారు. సిద్దాగుంట గ్రామ సర్వే నంబరు 113.7లో ఉన్న ప్రభుత్వ భూమి సుమారు 20 ఎకరాలు కూటమిని గత ఏడాది వెంకటగిరి పట్టణానికి చెందిన కొందరు ఆక్రమించి పట్టపగలే ఎక్స్‌వేటర్‌తో చదును చేశారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులే అడ్డుకోవడంతో ఆక్రమణదారులు కొన్నాళ్లు మిన్నకుండిపోయారు. ఇటీవల రాత్రిపూట భూమిని దున్ని సాగులోకి తెచ్చారు. అదేవిధంగా చిలమనూరు పంచాయతీ గొల్లగుంటలో అటవీ భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. వెంకటగిరి - నాయుడుపేట రహదారికి సమీపంలోని భూమి కావడంతో ఆక్రమణదారుల కన్ను పడింది. గత మూడు రోజులుగా పగలు, రాత్రి ఎక్స్‌వేటర్‌తో మొక్కలు తొలగించి చదును చేస్తున్నా అటవీశాఖ అధికారులు అటువైపు చూడలేదు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారని వీఆర్వోకు సమాచారం ఇవ్వగా ఆయన వెళ్లి పరిశీలించారు. ఆక్రమిత భూమి రెవెన్యూశాఖ పరిధిలో లేదని మిన్నకుండిపోయారు. పేదలు సాగు చేసుకుని జీవనం సాగిస్తుంటే అడ్డుకునే అటవీశాఖ అధికారులు సుమారు పది ఎకరాల పైబడి భూమిని ఆక్రమించి చదును చేస్తున్నా పట్టించుకోకుండా చోద్యం చూడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీశాఖ అధికారులతో సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తి దగ్గరుండి భూమిని చదును చేయిస్తున్నారని స్థానికులు



పాపిరెడ్డిపల్లి వడ్డిపాళెం సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి చెట్లు తొలగించిన కాబ్జాదారులు

ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఊట్లపల్లి పంచాయతీలో మా ఊరమ్మ చెరువు చివరన తెలుగంగ కాలువ ఆనుకుని ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో అదే వ్యక్తి మరో రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇటీవల ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో మోహన్ వెళ్లి అడ్డుకుని ఎక్స్‌వేటర్‌ను పంపించేశారు. ఇదే పంచాయతీలోని వడ్డిపాళెం సమీపంలో సర్వే నంబరు 70లో ఉన్న ప్రభుత్వ భూమిని వెంకటగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి ప్లాట్లుగా వేసి లక్షల రూపాలయలకు అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి: పాశిం



ఆటో డ్రైవర్లకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతా కుమారి

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి నుంచి ఎన్డీఏ నాయకులు ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీ ప్రారంభించి ఆదిశంకర యూనివర్శిటీ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆటో నడుపుతూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆదిశంకర యూనివర్శిటీలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ముందుకు వెళుతోందన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీల్లో లేనప్పటికీ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏడాదికి రూ.15వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో 2455 మందికి రూ.3.68 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నామ మాత్రంగా కొంతమందికి మాత్రమే రూ.10వేలు అందజేసి చేతులు దులుపుకుందన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, తీగల చంద్రశేఖర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పేటేటి ప్రకాశ్ రావు, రవాణాశాఖ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# హామీలకు మించి సంక్షేమ పథకాలు: విజయశ్రీ



ఆటోడ్రైవర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే సాధ్యమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం సూళ్లూరుపేటలోని శేషసాయి కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆటో ఎక్కి కొంతదూరం ప్రయాణించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చడమే కాకుండా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందించడం హర్షణీయమన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హామీలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధి చేయాలంటే బాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రైతు సహకార సేవా సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఆగిపోయిన లారీ వెనుక నుంచి ఢీకొన్న కంటైనర్

### డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

తడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగిపోయిన లారీని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొన్న ఘటన తడ మండల పరిధిలోని నిప్పో పరిశ్రమ ఎదురుగా శనివారం జరిగింది. నాయుడు పేట పట్టణానికి చెందిన ఓ లారీ ధాన్యం లోడుతో చెన్నైకు బయలు దేరింది. స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా జాతీయ రహదారిపై వెళ్తుండగా డీజిల్ అయిపోవడంతో లారీ ఆగిపోయింది. అదేదారిలో చెన్నై వెళ్తున్న ఓ కంటైనర్ లారీ ఆగిఉన్న ధాన్యం లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ వీరమణి ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసిశ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పొదుపు సంఘాలు, మున్సిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ 2.0 కరపత్రాలు అందజేశారు. దుకాణాల యజమానులు కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ ద్వారానే వస్తువులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారి భాస్కర్, మున్సిపల్ ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ శిరీష అన్నారు. మండల పరిధిలోని కడపత్ర అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో అంగన్వాడీ టీచర్లు భవాని, సుభాషిణి, నిర్మల పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. సంస్థ నిర్వాహకుడు బాలాజి మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, నివారణకు తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని మేనకూరు నుంచి భీమవరం గ్రామానికి నాబార్డ్ నిధులు రూ.88 లక్షలతో నిర్మించిన 4.7 కిలోమీటర్ల తారురోడ్డును శనివారం రాత్రి ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి జాడలేకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక నిధులను మంజూరు చేసి పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సర్పంచ్ అమృత సరళ, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, విజయకుమార్ నాయుడు, నానాబాల సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, రవి, నారాయణ, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, దార్ల రాజేంద్ర, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, చక్రపాణి, గాలి రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సకల జన సంక్షేమమే సీఎం ధ్యేయం: నెలవల

పెళ్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధితో పాటు సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం తాళ్వాయిపాడులో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.15వేల ఆర్థిక సాయం అందించే విశిష్ట పథకానికి సీఎం శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన రవిచంద్ర (35) కుటుంబకలహాల నేపథ్యంలో గత నెల 26వ తేదీన పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు గమనించి చెన్నైలోని ఓ ఆస్పత్రికి తీసుకెల్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కుక్కల బెడదను నివారించండి




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. పలువురు అధికారులు తమ శాఖల్లో ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీటీసీలు దారాసురేష్, షంషుద్దీన్, నారాయణ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో ఆవులు ఎక్కడపడితే అక్కడ సంచరిస్తుండడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సభ్యులు చెప్పగా, ఆవుల యజమానులకు నోటీసులు ఇస్తామని ఎంపీడీవో అన్నారు. కాగా, సమావేశానికి 17 మంది ఎంపీటీసీలకు గాను 11 మంది, 21 మంది సర్పంచులుండగా ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మండల సర్వసభ్య సమావేశాలకు ప్రతిశాఖ నుంచి అధికారులు హాజరుకావాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలకు కలెక్టర్‌కు సిఫారసు చేస్తామని తహసీల్దారు జయజయరావు అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కోటయ్య, పలుశాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత గోపాల్‌రెడ్డి మృతి



గోపాల్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు జయజయరావు, టీడీపీ నాయకులు

కోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కేతంరెడ్డి గోపాల్‌రెడ్డి (83) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటూ మృతి చెందారు. గోపాల్‌రెడ్డి మృతదేహానికి తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ గండవరం రజనమ్మ, తహసీల్దారు జయజయరావు, ఎస్ఐ పవన్‌కుమార్ నివాళులర్పించారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మెహబూబి

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో మెహబూబి అన్నారు. శనివారం స్థానిక అంకమ్మగుడి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజన, ఉమా, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నాయుడుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, గోపూజ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం యాగశాల బలి, వాస్తుహోమం, రాత్రి నివేదన హారతి కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి బాలాజీ, చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, రాధయ్య, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.